సాక్షి
తిరుపతి
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



దర్గాగా భూకబ్జా
చిన్నగొట్టిగల్లు మండలం, లంకిపల్లెవారిపల్లెలోని ప్రభుత్వ భూములపై ఎన్‌ఆర్‌ఐల కన్ను పడింది.
- 8లో



తిరుపతి..పెరగాలి పరపతి!
'తిరుపతి పరపతి మరింత పెరగాలి. తిరుమల తరహాలో తీర్చిదిద్దాలి..' అని తిరుపతి పౌర సమాజం టీటీడీకి సూచించింది.
- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	35	25
తిరుమల	30	21
గూడూరు	36	28
నగరి	36	26

న్యూస్‌రీల్

నేటి నుంచి పరిశోధనలపై సమీక్ష

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో మంగళవారం నుంచి రాష్ట్ర స్థాయి పరిశోధన, సాంకేతికపై సమావేశాలు జరగనున్నట్లు పరిశోధక సంచాలకులు డాక్టర్ కే.సర్జన్‌రావు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలలో 2022–23 సంవత్సరంలో వర్సిటీలో చేసిన పరిశోధనలపైన చర్చించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు 2023–24 చేపట్టవలసిన పరిశోధనలపై పూర్తి స్థాయిలో చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాలకు కర్ణాటక, తమిళనాడు వెటర్నరీ వర్సిటీల నుంచి పలువురు అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

తిరుపతిలో రాష్ట్ర స్థాయి ఆడుదాం-ఆంధ్రా పోటీలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలో రాష్ట్ర స్థాయి ఆడుదాం– ఆంధ్రా పోటీలు ఉంటాయని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహణకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సామాజిక బాధ్యతగా పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు ఇతర దాతలు సహకారం అందించాలని కోరారు. తిరుపతి జిల్లాలో 691 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 1,57,548 మంది క్రీడాకారులు, మండల స్థాయిలో 78,774 మంది, నియోజకవర్గ స్థాయిలో 3,876 మంది, జిల్లా స్థాయిలో 798 మంది, రాష్ట్రస్థాయిలో 114 మంది తిరుపతి ఎస్వీయూనివర్సిటీ పరిధిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నరేంద్ర, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, పరిశ్రమల డిప్యూటీ జెడ్ ఎం ఏపీఐఐసీ జవహర్, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డా.అరుణ సులోచన పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజేంద్ర

తిరుపతి క్రైం: జిల్లాలో నిషేధిత వస్తువులపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజేంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా నాటు సారా తయారు కాకుండా చూడాలన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని సూచించారు.

ఇబ్బందులు లేకుండా!

జిల్లాలో టీడీపీ అధిష్టానం ఇచ్చిన బంద్ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. ఉదయం నుంచి బస్సులు, ఇతర వాహనాలు యథాతథంగా నడిచాయి. దుకాణాలు, బ్యాంక్‌లు సైతం కొనసాగాయి. టీడీపీ అధినాయకులు ఎవ్వరూ బయటకు రాకపోవడంతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు వచ్చి మమ అనిపించి వెళ్లారు. కొందరు అధిష్టానం దృష్టిలో పడేందుకు నానాతంటాలు పడ్డారు. తాము బంద్‌కు వెళ్తున్నామని ముందుగా పోలీసులకు చెప్పి వెళ్లడం కొసమెరుపు. ఇక జనసైనికులు అక్కడక్కడా దుకాణాలు మూసేయాలంటూ రోడ్లపై తిరగడం కనిపించింది. ప్రజలెవ్వరికీ ఇబ్బందులు లేకపోవడంతో యథావిధంగా తమ దైనందిన కార్యకలాపాలు కొనసాగించారు.

- జిల్లాలో కనిపించని టీడీపీ బంద్ ప్రభావం
- యథాతథంగా నడిచిన బస్సులు, ఇతర వాహనాలు
- తెరిచే ఉంచిన చంద్రబాబు సొంత హెరిటేజ్ సంస్థ
- అమలు కాని టీడీపీ అధిష్టానం ఆదేశాలు



తిరుపతిలో యథావిధిగా తిరుగుతున్న వాహనాలు

సాక్షి, తిరుపతి: జిల్లాలో టీడీపీ బంద్ ప్రభావం కనిపించలేదు. టీడీపీ శ్రేణులే బంద్‌కు మద్దతు ఇవ్వలేదు. ముఖ్యంగా చంద్రబాబు సొంత సంస్థ అయిన హెరిటేజ్ పార్లర్ సిబ్బంది కూడా బంద్‌కు అంగీకరించలేదు. ఇటు టీడీపీ శ్రేణులు.. అటు ప్రజలు స్పందించకపోవడంతో ముఖ్యనాయకులు బంద్‌ను 'మమ' అనిపించారు. జిల్లా వాసి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఏసీబీ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడాన్ని నిరసిస్తూ టీడీపీ బంద్‌కు పిలునిచ్చిన విషయం తెలిసిందే. అయితే టీడీపీ ఇచ్చిన పిలుపునకు చంద్రబాబు సొంత జిల్లాలోనే స్పందన కరువైంది. తిరుపతి నగరంలో ముఖ్యమైన టీడీపీ నేతలెవ్వరూ రోడ్డుపైకి రానే లేదు. ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు ఓ పది మంది వచ్చి ఐదారు నిముషాలు అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. అదేవిధంగా జనసేన నాయకులు ఐదుగురు వచ్చి మొక్కుబడిగా ఆందోళన చేసి చేతులు దులుపుకున్నారు. శ్రీకాళహస్తి, రేణిగుంటలో అయితే టీడీపీ నేతలు బంద్‌కు సహకరించాలంటూ వీధి వీధినా తిరుగుతూ దుకాణాలు మూసివేయండంటూ రెండు చేతులెత్తి దణ్ణం పెట్టి వేడుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఒకరిద్దరు దుకాణాలు మూసినట్టు మూసి.. టీడీపీ శ్రేణులు అటు వెళ్లగానే యథావిధిగా తెరుచుకున్నారు.

సార్ ప్లీజ్.. అరెస్ట్ చేయండి

జిల్లాలో బంద్‌కు ఎవ్వరూ సహకరించకపోవడంతో టీడీపీ శ్రేణులు కొందరు ఆందోళనలు చేశామని చెప్పుకునేందుకు నానాతంటాలు పడ్డారు. తాము బస్సులు ఆపడానికి, దుకాణాలు మూయించేందుకు వెళ్తున్నాం అని పలుచోట్ల ముందుగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. బంద్‌కు ఎవ్వరూ సహకరించడం లేదని, గట్టిగా అడిగితే జనం తమపై తిరగబడుతున్నారంటూ ఆందోళనకు లోనయ్యారు. అధిష్టానం దృష్టిలో తాము గట్టిగా ఆందోళన చేశామని చెప్పుకునేందుకైనా వచ్చి మమ్మల్ని అరెస్ట్ చేయమని పోలీసును ప్రాధేపడినట్లు విశ్వసనీయ సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడం కనిపించింది. కొంత సమయం తర్వాత టీడీపీ శ్రేణులు ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

ఆర్టీసీలో బంద్ ప్రభావం నిల్

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో బంద్ ప్రభావం కనిపించలేదు. ఉదయం నుంచి యథావిధిగా అన్ని సర్వీసులు నడిచాయి. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా 11 డిపోలకు చెందిన 779 సర్వీసులు యథావిధిగా తిరిగాయి.



తిరుపతి బస్టాండ్ ప్రాంగణంలో రద్దీ

బంద్ పాటించని హెరిటేజ్



తెరిచి ఉన్న హెరిటేజ్ పార్లర్

టీడీపీ అధిష్టానం బంద్‌కు పిలిపునిచ్చినా కాశిపెంట్లలో ఉన్న హెరిటేజ్ పార్లర్‌లో యథావిధిగా నడిచింది. 'బంద్ అన్నారు కదా. మీకు లేదా' అని కొనుగోలు దారులు హెరిటేజ్ నిర్వాహకులను అడగగా 'బందూ లేదు.. ఏమీ లేదు' అంటూ సమాధానం ఇవ్వడం కొసమెరుపు.

జిల్లాలో 144 సెక్షన్, పోలీస్ 30 యాక్ట్ అమలు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా పరిధిలో 144 సెక్షన్‌తో పాటు పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉందని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ముందస్తు పోలీసు అనుమతి లేకుండా జిల్లాలో ఎక్కడా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, బంద్‌లు నిర్వహించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

స్పందనకు ప్రాధాన్యత ఇవ్వండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమానికి 67 అర్జీలు వచ్చినట్టు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 50 వినతులు ఉన్నట్టు వెల్లడించారు. జేసీ డీకే బాలాజీ, డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 40 ఫిర్యాదులు



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఏఎస్పీ విమలకుమారి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 40 ఫిర్యాదులు వచ్చినట్టు ఏఎస్పీ విమల కుమారి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద మొత్తంలో ఫిర్యాదులు వచ్చినట్టు వెల్లడించారు.

చట్టానికి ఎవరూ అతీతులు కాదు

- న్యాయస్థానం నమ్మింది కాబట్టే రిమాండ్
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చట్టానికి ఎవ్వరూ అతీతులు కాదని, చంద్రబాబు తప్పుచేశారని న్యాయస్థానం నమ్మింది కాబట్టే రిమాండ్ విధించినట్లు తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చంద్రగిరిలో ఆయన మీడియాతో మాట్లాడారు. వందల కోట్ల స్కామ్‌లో చంద్రబాబు ప్రమేయం ఉందని సీఐడీ అధికారుల వాదనను న్యాయస్థానం విశ్వసించిందన్నారు. అందుకే ఢిల్లీ నుంచి ప్రముఖ లాయర్లను ప్రత్యేక విమానాల్లో తెప్పించుకుని వాదనలు వినిపించినా న్యాయదేవత విశ్వసించలేదన్నారు. తప్పు చేసి చట్టం నుంచి తప్పించుకోవచ్చనే వారికి చంద్రబాబు రిమాండ్ ఒక చెంపపెట్టు అని తెలిపారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కోర్టు ఆదేశం మేరకు చంద్రబాబు సెంట్రల్ జైల్‌కు ఖైదీగా వెళ్లితే దానికి వైఎస్సార్‌సీపీకి లింకు పెట్టడం టీడీపీ నేతల అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు.



చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రెండో దశ 'నాడు-నేడు' వేగవంతం

తిరుపతి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో రెండో దశ నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని జేసీ డీకే బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నాడు-నేడు పనులపై ఆయన సమీక్షించారు. జిల్లాలోని పేరెంట్స్ కమిటీ అకౌంట్స్‌లో అందుబాటులో ఉన్న రూ.13 కోట్లను ఉపయోగించుకోవాలని సూచించారు. డీఈఓ శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయ్‌కుమార్, నాడు-నేడు ప్లానింగ్ కో-ఆర్డినేటర్ పాల్గొన్నారు.

వేదిక్‌లో అధీంద్రియ విజ్ఞానం కోర్సు ప్రారంభం

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో అధీంద్రియవిజ్ఞానం సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభోత్సవం సోమవారం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, ప్రత్యేక అతిథిగా రుషీకేష్‌కు చెందిన క్రియా యోగా కేంద్ర నిర్వాహకులు శ్రీశంకరానందగిరి స్వామి పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ ప్రపంచ మానవుల సమస్యలకు సనాతన ధర్మంలోని క్రియాయోగా మార్గం, అధీంద్రియ విజ్ఞానం ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. వాటిని మనం నిత్య జీవితంలో ఆచరించడం ద్వారా మానసిక సమస్యల నుంచి బయటపడతామని చెప్పారు. అనంతరం ఉపకులపతి ఆచార్య రాణీ సదాశివమూర్తి మాట్లాడారు. మానవ సమస్యలకు పరిష్కారం చూపేందుకు వేద విశ్వవిద్యాలయంలో అధీంద్రియ విజ్ఞానము అనే సర్టిఫికెట్ కోర్సును ప్రవేశపెడుతున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రాధేశ్యామ్, గోలి సుబ్రమణ్యశర్మ, ఫణియాజులు పాల్గొన్నారు.



శ్రీశంకరానందగిరి స్వామిని సత్కరిస్తున్న టీటీడీ ఈఓ

అటవీ సంపద సంరక్షణే లక్ష్యం

- ఎస్వీ జూపార్క్ వద్ద ఘనంగా జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం



అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న పీసీసీఎఫ్, రాష్ట్ర వైల్డ్‌లైఫ్ వార్డెన్, సీసీఎఫ్



నివాళి అర్పిస్తున్న పీసీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి

తిరుపతి మంగళం: అటవీ సంపద సంరక్షణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) వై. మధుసూదన్‌రెడ్డి పిలునిచ్చారు. తిరుపతి ఎస్వీ జూపార్క్ వద్ద సోమవారం జూ క్యూరేటర్ సెల్వం ఆధ్వర్యంలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జూపార్క్ వద్ద ఏర్పాటు చేసి అమరవీరుల స్థూపానికి పీసీసీఎఫ్‌తోపాటు, రాష్ట్ర వైల్డ్‌లైఫ్ వార్డెన్ రంగరాజు, సీసీఎఫ్ నాగేశ్వరరావు పుష్పాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ మాట్లాడుతూ అటవీ సంరక్షణలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అటవీ సంరక్షణలో ప్రజలు భాగస్వాములు చేయడానికి కమ్యూనిటీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కాన్సెప్ట్‌ను తీసుకువచ్చినట్టు తెలిపారు. అటవీ సంపదను కాపాడడంలో తమ ప్రాణాలను సైతం అర్పించిన 23 మంది అటవీ సిబ్బంది త్యాగఫలం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అటవీ సిబ్బంది నిస్వార్థమైన సేవలందించారని కొనియాడారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను వారు సత్కరించారు. తిరుపతి వైల్డ్‌లైఫ్ డీఎఫ్ సతీష్‌కుమార్‌రెడ్డి, బయోట్రిమ్ ఇన్‌చార్జ్ యశోదబాయ్, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముక్, టీటీడీ అటవీ అధికారి శ్రీనివాసులు, ఫ్లైయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్, ఎర్రచందనం గోడౌన్ డీఎఫ్ఓ శివకుమార్ పాల్గొన్నారు.

11 మంది ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

తిరుపతి అర్బన్: మంగళం డిపో పరిధిలో డీజిల్ ఆదా చేసిన 7 మంది డ్రైవర్లు, రాబడిని తీసుకొచ్చిన నలుగురు కండక్టర్లకు సోమవారం డీఎం భాస్కర్‌రావు ప్రశంసా పత్రాలు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ నిర్మల, అసిస్టెంట్ ఇంజినీర్ కళ పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న డ్రైవర్లు, కండక్టర్లతో డీఎం, అసిస్టెంట్ డీఎంలు

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు … గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా… అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా… మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా… ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే… దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:
విశ్వం సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్
విశ్వం నగర్, జీవకోన, తిరుపతి
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 96666 97219

గడప గడపలో సంతోషం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: రాష్ట్రంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుసంపన్నమైన పాలన అందిస్తున్నారని, సంక్షేమ పథకాలు నేరుగా గడపగడపకు అందుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తంచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కళవలపూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించి అప్పటికప్పుడే పరిష్కరించారు.

చట్టం ముందు అందరూ సమానమే

వాకాడు: తప్పు చేస్తే ఎంతటి వారైనా శిక్ష అనుభవించక తప్పదని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం వాకాడులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కిల్‌డెవలప్‌మెంట్ స్కామ్‌లో రకూ.371 కోట్లు దోచేసిన చంద్రబాబునాయుడికి ఎట్టకేలకు శిక్ష పడిందని తెలిపారు. తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని ఆయన సూచించారు. వైఎస్సార్‌సీపీ నేతలు కొడవలూరు దామోదర్‌రెడ్డి, రౌతు రామకృష్ణ, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దువ్వూరు మధురెడ్డి, షనీల్‌రెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, గూడూరు సుధాకర్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, వాకాటి రవి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,449 మంది స్వామి వారిని దర్శించుకోగా 33,570 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.47 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చరిత్ర హీనుడు చంద్రబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరు రూరల్: రాజ్యాంగాన్ని, వ్యవస్థలను అపహాస్యం చేసిన చరిత్ర హీనుడు చంద్రబాబు అని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మండిపడ్డారు. సోమవారం సాయంత్రం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ చట్టం ఎవరికీ చుట్టం కాదని, ఎవరు తప్పుచేసినా శిక్ష అనుభవించక తప్పదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అవినీతి చేసినందుకే చంద్రబాబుని అరెస్టు చేశారని, ఇందులో ఎలాంటి రాజకీయ కుట్ర లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కాంద్ర నారాయణరెడ్డి, రాజారెడ్డి, కస్తూరిరెడ్డి, నేదురుమల్లి హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్వజస్తంభం తొలగింపు



పర్యవేక్షిస్తున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీఅన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శిథిలావస్థకు చేరిన ధ్వజస్తంభాన్ని సోమవారం తొలగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు సమక్షంలో పంచానామా చేసి తొలగించారు. ప్రస్తుతం ఆలయంలో జీర్ణోద్ధారణ పనులు జరుగుతున్నాయని, 15న శాంతిపూజ, ఆ తర్వాత కుంభాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

8 మంది టీడీపీ నేతలపై హత్యాయత్నం కేసు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో 8మంది టీడీపీ నాయకులపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఆదివారం చంద్రబాబునాయుడు అరెస్టు సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలో టీడీపీ నాయకులు గందరగోళం సృష్టించాలని యతి్నంచారు. ఈనేపథ్యంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో వారు తమను వదలాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో స్టేషన్‌లో దాడులకు యత్నించారు. దీంతో ఎస్‌ఐ ఫిర్యాదు మేరకు 8మందిపై సోమవారం రాత్రి హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వారిలో చెంచయ్యనాయుడు, కాసరం రమేష్, రెడ్డివారి గురవారెడ్డి, సుజిత్‌కుమార్, వినయ్, బాలాజీ, కృష్ణమనాయుడు, కృష్ణయాదవ్ ఉన్నారు. వీరిని ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా 14రోజుల రిమాండ్ విధించారు.

మహిళ ఆత్మహత్య


మౌనిక మృతదేహం

రాపూరు: కడుపు నొప్పి తాళలేక గుళికల మందు తిని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఆకలివలస గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. గ్రామానికి చెందిన మౌనిక(23)ను డక్కిలి మండలం లింకసముద్రానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. గత కొద్ది రోజులుగా మౌనిక తన స్వగ్రామమైన ఆకలివలసలో ఉంటోంది. కొద్దిరోజులుగా కడుపు నోప్పితో బాధపడుతోంది. సోమవారం కడుపు నొప్పి ఎక్కువ కావడంతో మౌనిక గుళికల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు దర్యాప్తులో ఉంది.

తిరుపతి..పెరగాలి పరపతి!

- టీటీడీ తక్షణ భాగస్వామ్యం అవసరం
- భక్తుల తొలి పాదం తిరుపతిలోనే
- తిరుమల తరహాలో తిరుపతిని తీర్చిదిద్దాలి
- దీనికి టీటీడీ నిధులే శరణ్యం
- తిరుపతి అభివృద్ధిపై పౌర సమాజం ఏకగ్రీవ తీర్మానం


మాట్లాడుతున్న భూమన సుబ్రమణ్యంరెడ్డి

తిరుపతి తుడా: 'తిరుపతి పరపతి మరింత పెరగాలి. తిరుమల తరహాలో తీర్చిదిద్దాలి. దీనికి టీటీడీ నిధులు సమకూర్చాలి. భక్తులు, స్థానికులు, పర్యాటకులకు ఆధునిక సౌకర్యాలు, పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించాలి' అని తిరుపతి పౌర సమాజం ఏకగ్రీవంగా తీర్మానించింది. తిరుపతి పరిశుభ్రత, అభివృద్ధిపై తిరుపతి పౌర సమాజం ఆధ్వర్యంలో సలహాలు, సూచనల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. స్థానికంగా ఓ హోటల్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి శ్వేత విశ్రాంత సంచాలకులు భూమన్, సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రారెడ్డి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్‌కావడం నగరాభివృద్ధికి కలిసి వచ్చే అంశంగా పలువురు అభిప్రాయపడ్డారు. తిరుపతి అభివృద్ధి విషయంలో టీటీడీ ప్రత్యేక దృష్టి సారించాలని.. ఆ దిశగా నిర్ణయాలు తీసుకోవాలని టీటీడీ చైర్మన్ భూమనకు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. అదేవిధంగా తిరుపతి నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి దీర్ఘ దృష్టితో తీసుకొచ్చిన విజన్ తిరుపతి అభివృద్ధికి మరింతగా తోడ్పడుతుందన్న వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. అనంతరం నగరాభివృద్ధిని కాంక్షించిన పౌర సమాజం పలు అంశాలపై సమావేశంలో చర్చించి తీర్మానించింది. తీర్మానాలను సీపీఐ నేత తులసేంద్ర సమావేశంలో ప్రవేశ పెట్టారు. బీఆర్‌ఎస్ పార్టీ నేత ప్రసాద్, నగర ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు పాల్గొన్నారు.

పౌరసమాజం తీర్మానాలు ఇవే

- టీటీడీ నుంచి ఆర్థిక వనరులు సమకూర్చే బాధ్యతను చైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి అప్పగించాలి
- తిరుపతి పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోస టీటీడీ అదనపు సిబ్బందిని నియమించాలి.
- భక్తులు వదిలేసిన వ్యవర్థాలను తిరుపతి నగరపాలక సంస్థ బాధ్యతగా తొలగిస్తోందని, అందు కోసం అవసరమైన నిధులు, మ్యాన్‌పవర్‌ను సమకూర్చాలి.

ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం



మెరుగైన పారిశుద్ధ్యం అమలు కావాలంటే అందులో ప్రజలను సంపూర్ణ భాగస్వాములను చేయాలి. ముఖ్యంగా వ్యాపార సముదాయాల వద్ద ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి. తడి చెత్తను పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. టీటీడీ ఆరోగ్య గోవిందం కార్యక్రమాన్ని చేపట్టాలి.
– డాక్టర్ కృష్ణప్రశాంతి

నిరంతరం పనిచేస్తాం



క్లీనెస్ట్ తిరుపతిలో నగర ప్రజల్ని పూర్తి స్థాయిలో భాగస్వాములను చేస్తాం. నిషేధిత ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం మోపుతాం. ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి. పరిశుభ్ర తిరుపతి కోసం నిరంతం పనిచేస్తాం.
–డాక్టర్ యువ అన్వేష్, హెల్త్ ఆఫీసర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

పార్కింగ్ సమస్య పరిష్కరించాలి



తిరుపతి నగరంలో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ వ్యవస్థ ఆది నుంచి అమలు కాలేదు. దీని కారణంగా భవనాలు నిబంధనల ప్రకారం లేవు. దీంతో పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు.
–మాంగాటి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేత

మంచి నిర్ణయం



తిరుపతి అభివృద్ధిలో టీటీడీని భాగస్వామ్యం చేయాలన్న ఆలోచన మంచి నిర్ణయం. తిరుపతి భవిష్యత్‌ను మార్చే నిర్ణయం. పౌరసమాజం తీసుకున్న నిర్ణయాలను టీటీడీ ఏకగ్రీవంగా ఆమెదం తెలపాలి. తిరుమల బాగుంటే సరిపోదు, తిరుపతి కూడా బాగుండాలి. ఆ బాధ్యత టీటీడీ తీసుకోవాలి.
– విశ్వం విశ్వనాథరెడ్డి, ప్రైయివేటు పాఠశాలల అసోసియేషన్

మెరుగైన పారిశుద్ధ్యమే లక్ష్యం



తిరుపతి నగరంలో మెరుగైన పారిశుద్ధ్యమే లక్ష్యంగా నగరపాలక సంస్థ పనిచేస్తోంది. ఇందులో భాగంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం ప్రస్తుత ఉన్న సిబ్బంది సరిపోవడం లేదు. మరో 1,678 మంది సిబ్బంది అవసరమని భావిస్తున్నాం. పారిశుద్ధ్య నిర్వహణకు టీటీడీ భాగస్వామ్యం అవసరం.
–భూమన అభినయ్‌రెడ్డి, నగర డిప్యూటీ మేయర్, తిరుపతి

టీటీడీ సహకారం అవసరం



తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు జరగాలి. రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, వీటితో పాటు పార్కులు, పారిశుద్ధ్య పనుల నిర్వణ కోసం టీటీడీ నుంచి ఆర్థిక సహకారం తీసుకోవాలి. –టీ.తులసేంద్ర, సీపీఐ నేత

అభివృద్ధికి చట్టాలు అడ్డురావు



టీటీడీ నిధులను తిరుపతి అభివృద్ధికి వినియోగించాలి. ఇందుకు ఏ చట్టం కూడా అడ్డురాదు. తిరుపతి అభివృద్ధిలో టీటీడీని ఎప్పుడో భాగస్వామ్యం చేయాల్సింది. –కందారపు మురళి, సీపీఎం నేత

తాగునీటి సమస్య పరిష్కరించాలి



తిరుపతిలో రోడ్లు, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా.. ఇలా ఈ మూడు అంశాలను వేరు చేయలేము. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మంచినీటికి శాశ్వత పరిష్కారం అవసరం.
–మాకిరెడ్డి పురుషోత్తమరెడ్డి, కన్వీనర్, రాయలసీమ మేధావుల ఫోరం

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం


అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థి విభాగం నేతలు

తిరుపతి సిటీ : చంద్రబాబు పాపం పండిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం సీనియర్ నాయకులు వీ.హరిప్రసాద్‌రెడ్డి, మురళి, కిషోర్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సోమవారం ఎస్వీయూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్దగల బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వారు పాలాభిషేకం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 14 ఏళ్లుగా సీఎం పదవిలో కొనసాగిన చంద్రబాబు నాయుడు వ్యవస్థలను, చట్టాలను మేనేజ్ చేస్తూ ప్రజాధనాన్ని దోచుకున్నాడని, అందుకే ఇప్పుడు తగిన శిక్ష అనుభవిస్తున్నాడని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ విద్యార్థి విభాగం నేత సురేష్‌నాయక్, పెద్ద సంఖ్యలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి

కేవీబీపురం: నీటిగుంతలో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన కేవీబీపురం మండలం, పెరిందేశం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం.. పెరిందేశం దళితవాడకు చెందిన నాగయ్య, సుబ్బలక్ష్మి కుమార్తె నవ్య(2) ఇంటి వద్ద ఆడుకుంటూ నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో ప్రమాదవశాత్తు పడిమృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఘనంగా ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- 200 మందికిపైగా రక్తదానం


ఎస్వీయూలో కేక్ కట్ చేస్తున్న రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, పెద్దిరెడ్డి సుదీర్‌రెడ్డి

తిరుపతి సిటీ: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఎస్వీ యూనివర్సిటీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాయలసీమ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు వీ.హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆ పార్టీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీరేంద్రవర్మ, వై.ఆనందరెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన జన్మదిన వేడుకల్లో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రమేష్‌రెడ్డి, మురళి, హేమంత్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, దస్తగిరి, తేజేశ్వరరెడ్డి, రమణారెడ్డి, సతీష్‌రెడ్డి, సురేష్ నాయక్, రామకృష్ణ, సదా, శివయాదవ్‌తో పాటు సుమారు 500మందికి పైగా విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ఎస్వీయూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద రాయలసీమ వైస్సార్సీసీపీ విదార్థి విభాగం నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎస్వీయూ విద్యార్థులతో పాటు నగరంలోని పలు కళాశాలల నుంచి సుమారు 200మందికి పైగా విద్యార్థులు రక్తమిచ్చారు.

యాదాద్రిలో ఎంపీ మిథున్‌రెడ్డి పూజలు


ఎంపీ మిథున్‌రెడ్డికి ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి వెంకటేష్

యాదగిరిగుట్ట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంపీ మిథున్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు పూజలు చేశారు. మిథున్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ప్రొటోకాల్ అధికారి వెంకటేష్ లడ్డూ ప్రసాదం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిల్లకూరు: గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బూదనం టోల్ ప్లాజా సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం .. గూడూరు రూరల్ పరిధిలోని పోటు పాళెంకు చెందిన నవకోటి సొంత పనిమీద చెన్నైరుకు బైక్‌పై వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి నాయుడుపేటకు వెళ్లేందుకు బయలుదేరగా చెన్నూరు గ్రామానికి చెందిన సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి తాను నాయుడుపేటకు వస్తానని చెప్పడంతో అతనిని బైక్‌పై ఎక్కించుకుని బయలు దేరాడు. ఈ క్రమంలో బూదనం టోల్ ప్లాజా దాటిన తర్వాత పత్రగుంట సమీపంలో వెనుక నుంచి వచ్చే గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 60 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. నవకోటి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రేషన్ బియ్యం స్వాధీనం


పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

దొరవారిసత్రం: మండలంలోని నెలబల్లి గ్రామ పరిధి జాతీయ రహదారిపై వ్యవసాయశాఖ చెక్ పోస్టు వద్ద సోమవారం సాయంత్రం అక్రమంగా చెన్నైకి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయ్ అధికారులు ఉమ్మడిగా దాడిచేసి సీజ్ చేశారు. వారి కథనం మేరకు.. పెళ్లకూరు, డీవీ సత్రం మండలాల్లో అక్రమంగా కొనుగోలు చేసి చెన్నైకి లారీలో సుమారు రూ.1.48 లక్షలు విలువ చేసే 4,010 కిలోల బియ్యం తరలిస్తుండగా, సిబ్బంది గుర్తించి సీజ్ చేశారు. లారీ డ్రైవర్ షేక్ సద్దాంహుస్సేన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి లారీని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు వారు పేర్కొన్నారు. ఈదాడుల్లో విజిలెన్స్ అధికారులు విజయ్‌కుమార్, రామకృష్ణనాయక్, సీఎస్ డీటీ ఓబయ్య పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్‌ఐ

నాయుడుపేట టౌన్: నాయుడుపేట రైల్వే స్టేషన్ యార్డు సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని రైల్వే కీమెన్ సోమవారం గుర్తించి సూళ్లూరుపేట రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్‌ఐ జీ.మాలకొండయ్య, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రైలు నుంచి జారి పడి ఉండవచ్చని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతుడు మెరున్ రెడ్ కలర్ టీ షర్టు, లైట్ బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్టు వెల్లడించారు. ఈ మేరకు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల పోస్టుమార్టం గదిలో భద్రపరిచినట్టు ఆయన పేర్కొన్నారు.

ఏడుగురు బైక్ దొంగల అరెస్టు

- 15 లక్షల విలువ చేసే 17 ద్విచక్ర వాహనాలు, సుమో స్వాధీనం


పట్టుబడిన వాహనాలను చూపుతున్న డీఎస్పీ

తిరుపతి క్రైం: తిరుపతి జూపార్క్ రోడ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ సురేందర్‌రెడ్డి తెలిపారు. అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను జూ పార్క్ రోడ్‌లో ఆదివారం అలిపిరి సీఐ అబ్బన్న, సిబ్బంది గుర్తించి అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఇందులో అన్నమయ్య జిల్లాకు చెందిన సుంకేసుల మస్తాన్, కానిశెట్టి సుబ్రహ్మణ్యం, గిద్దలూరు సుబ్రమణ్యం, తిరుపతికి చెందిన జైకుమార్, తమిళనాడుకు చెందిన గణేష్ రవి అలియాస్ తమిళ రవి, చిత్తూరు చెందిన పాయని మునిగంధన్ అలియాస్ మణి ఉన్నట్టు తెలిపారు. వీరంతా ముఠాగా ఏర్పడి మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడేవారన్నారు. ఆ తర్వాత వాటిని అమ్ముకుని జల్సాలకు అలవాటు పడేవారన్నారు. ఈ క్రమంలో వారి నుంచి 17 మోటార్ సైకిళ్లు, టాటూ సుమోను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందన్నారు. వీరిపై అలిపిరి పోలీస్ స్టేషన్‌లో 11 కేసులు, ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఏడు కేసులు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు.

మద్యం దుకాణం క్యాషియర్‌పై దాడి

- రూ.7.47లక్షల నగదు, లాప్‌ట్యాప్ దోపిడీ

తడ: ప్రభుత్వ మద్యం దుకాణం క్యాషియర్‌పై దాడి చేసి, నగదు దోచుకెళ్లిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్‌ఐ జేపీ.శ్రీనివాసరెడ్డి కథనం.. రామాపురం మద్యం దుకాణంలో బీవీపాళెం గ్రామానికి చెందిన ప్రభు పనిచేస్తున్నాడు. శని, ఆదివారాలు సెలవు కావడంతో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు వసూలైన నగదును తడ బ్యాంకులో జమచేసేందుకు స్కూటీపై బయలు దేరాడు. అదే సమయంలో ల్యాప్ టాప్‌కు పాచ్ వేయించేందుకు దానిని కూడా వెంట తీసుకు బయలు దేరాడు. ఈ క్రమంలో రామాపురం బ్రిడ్జి దిగుతున్న సమయంలో వెనుక మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు స్కూటీని కాలుతో తన్నడంతో ప్రభు కిందపడిపోయాడు. వెంటనే ఇద్దరు దుండగులు తమ వెంట తెచ్చుకున్న కత్తిని చూపి, ఆపై ప్రభుని కొట్టి అతని వద్ద ఉన్న నగదు, లాప్‌ట్యాప్‌న అపహరించుకుని వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న మద్యం దుకాణం సిబ్బంది గాయపడ్డ ప్రభుని తడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైల్వే అండర్ బ్రిడ్జికి రూ.12.23 కోట్లు

తిరుపతి అర్బన్: తిరుపతి-రేణిగుంట రోడ్డులో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలోని రైల్వే క్రాసింగ్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ గురుమూర్తి రూ.12.23 కోట్లు మంజూరు చేయించారని డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీలైనంత త్వరగా పనులు చేపట్టేలా సహకారం అందిస్తామని వెల్లడించారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తిరుపతిలోని అన్ని ప్రాంతాల్లోనూ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుముఖం పట్టిందని, త్వరలో శ్రీనివాస సేతు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. తద్వారా ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులుండవని వెల్లడించారు.

దర్జాగా భూకబ్జా


కుంచేనుగుట్టను (లంకిపల్లెవారిపల్లె) చదును చేస్తున్న దృశ్యం



గూగుల్ చిత్రంలో గుట్టగా ఉన్న భూమి

- చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ భూముల్లో భారీగా ఆక్రమణలు
- దశాబ్దాలుగా సాగులో ఉన్న పొలాలకు సైతం దారి లేకుండా ఫెన్సింగ్
- పోలీసులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు

భాకరాపేట: ఈ మధ్యకాలంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండాపోయింది. ఖాళీ స్థలం కనబడితే చాలు కబ్జా చేసేస్తున్నారు. చిన్నగొట్టిగల్లుకు కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ప్రభుత్వ భూమిని ఎలా ఆక్రమిస్తారని, సప్లయ్ చానల్ పూడ్చవద్దని స్థానికులు అడిగితే వారిపై దాడులకు తెగబడుతున్నారు. ఈ క్రమంలోనే భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో 2020 (309/2020) 2023 (69/2023) కేసులు నమోదయ్యాయి.

ప్రభుత్వభూమిపై ఎన్‌ఆర్‌ఐ కన్ను

చిన్నగొట్టిగల్లు మండలం, లంకిపల్లెవారిపల్లె శివారులోని సర్వే నం.975లో ఉన్న ప్రభుత్వ భూములపై ఎన్‌ఆర్‌ఐ (గ్రీన్ కార్డు హోల్డర్) కన్ను పడింది. ఆ భూమిలో నుంచి రైతులు తమ పొలాలకు వెళ్లేవారు. ప్రస్తుతం ఆ భూమిని ఎన్‌ఆర్‌ఐ ఆక్రమించి, చదునుచేసి ఫెన్సింగ్ వేసుకున్నారు. ఈ భూమిని అనుకుని ఉన్న సర్వే నం.(976, 977, 1604, 1605) దారి సౌకర్యం కూడా లేకుండా చేశారు. దీనిపై ప్రశ్నిస్తే తన భార్య పేరుతో అసైన్డ్ పట్టా పొందినట్లు పేర్కొంటున్నారు. అదేలాగని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో రైతులు రెండుసార్లు భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేశారు. మండల తహసీల్దార్‌కు, ఆర్డీవోకు, జిల్లా కలెక్టర్ సైతం ఫిర్యాదు చేశారు.

న్యాయం చేస్తాం

ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అలా కాకుండా అసైన్‌మెంట్ పట్టా పొంది ఉన్నారని చుట్టపక్కల రైతులు కూడా చెప్పారు. అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటాం. రెవెన్యూ చట్టం, నిబంధనలను అతిక్రమించి ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగుచేస్తున్న వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.
– లోకేశ్వరి, తహసీల్దార్, చిన్నగొట్టిగల్లు